# అన్నదాతల అరిగోస: ఎమ్మెల్యే హరీశ్‌రావు



కొనుగోళ్లు వేగవంతం చేయాలి..

రైతుల గోస చూస్తే కడుపు తరుక్కుపోతుంది

సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం పరిశీలన

అధికారుల తీరుపై ఆగ్రహం

రైతులకు భరోసా కల్పిస్తూ ఓదార్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, మే 5 సిరి న్యూస్ః**

రైతుల గోస చూస్తే కడుపు తరుక్కుపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. పలువురు రైతులు తాము మార్కెట్‌లో పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. రైతులకు భరోసా కల్పిస్తూ ఓదార్చారు.కొనుగోళ్లను వేగవంతం చేస్తామని ధైర్యం చెప్పారు. శనివారం మార్కెట్‌లో కాంటాపెట్టిన ధాన్యం బస్తాలను లారీలు లేక మిల్లులకు తరలించలేదని, దీంతో వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు.మార్కెట్‌లో హమాలీలు, లారీల సమస్య ఉందని తెలుపగా వెంటనే డీసీఎస్‌వో, ఆర్డీవోకు ఫోన్‌లో మాట్లాడారు. లారీలు, హమాలీలను సమకూర్చక పోవడంతో ధాన్యం తడిసిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం వల్ల అన్నదాతలు అరిగోస పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కాంటా అయిన వెంటనే ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. ఇప్పకే ధాన్యం తడిసి ముకవాసన వస్తున్నాయని, మరో రెండు రోజులు ఉంటే మొలకలు వచ్చే అవకాశం ఉందన్నారు. డీసీఎస్‌వో మార్కెట్ యార్డుకు వచ్చి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఆదేశించారు. లారీ అసోసియేషన్ యజమానులతో మాట్లాడి లారీలను పంపాలని కోరారు. జిల్లాలోనే అతిపెద్ద మార్కెట్‌లో కొనుగోలు ప్రక్రియ ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాల్లో వారాల కొద్దీ కాంటాలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టార్పాలిన్లు లేక అకాల వర్షాలకు ధాన్యం తడిసిందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 72 గంటల్లోగా డబ్బులను బ్యాంకు ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాలసాయిరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు గుండు భూపేష్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు దరిపల్లి శ్రీను, సుందర్, నర్సింహులు పాల్గొన్నారు.

**రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..**

అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని దర్గపల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాటాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో 1800 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం జరిగిందన్నారు. వ్యవసాయశాఖ, హార్టికల్చర్‌శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పంటనష్టం అంచనావేసి తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత నెలలో ఐదుసార్లు వరుసగా అకాల వర్షాలు పడ్డాయని, మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైన గాలితో వర్షం కురిసిందని, దీంతో వరి, పండ్ల తోటల రైతులు నష్టపోయారన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఎద్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ సర్పంచ్ బాలయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, మండల వ్యవసాయాధికారి గీత, ఆర్ఐ లింగం పాల్గొన్నారు.

## రైతులు విలపిస్తుంటే కలెక్టర్ కు బాధ్యత లేదా..?

**దుబ్బాక, మే 5 సిరి న్యూస్ః**

వడగండ్ల వర్షం తో చేతికి వచ్చిన పంట నేల రాలిపోవడంతో రైతులు బోరుమని విలపిస్తుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన జిల్లా కలెక్టర్ భూ భారతి మీటింగ్ కు వెళ్లడం చూస్తే రైతులపై పాలకులకు ఏ పాటి శ్రద్ధ ఉందో అర్థమవుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వడగండ్ల వర్షం తో తొగుట మండలం లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా కాన్గల్, లింగంపేటలలో వరి పంటలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. లింగంపేటలో సొసైటీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%% మల్లన్న సాగర్ లో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ సకాలంలో ప్రభుత్వం నీళ్లు విడుదల చేయకపోవడంతో ఆలస్యంగా వరినాట్లు వేయడంతో పంట ఆలస్యమైందన్నారు. పంట మార్పిడిలో ఆలస్యం కావడంతో నేడు కురిసిన వడగండ్ల వర్షం మూలంగా వరి పంటకు అపార నష్టం వాటిల్లిందన్నారు. లింగంపేట, కాన్గల్, తొగుట, పెద్దమాసాన్ పల్లి, బందారుపల్లి, ఎల్లారెడ్డిపేట, ఘనపూర్, గుడికందుల, గోవర్ధనగిరి తదితర గ్రామాల్లో పూర్తి స్థాయిలో పంట, ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

## చర్యలు తీసుకోవాలి

**సంగారెడ్డి, మే 5 ( సిరి న్యూస్ )**



కంది మండలం ఏర్దనూర్ గ్రామంలో అక్రమంగా క్రషర్లు పెట్టి గుట్టలను ధ్వంసం చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జెసి చంద్రశేఖర్‌కు ఆల్ ఇండియా అంబేద్కర్ యువ సంఘం జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేశారు.ఏర్దనూర్ గ్రామంలోని కమ్మరోని కుంట, తూముకుంట, గుట్టమీద కుంటలను ధ్వంసం చేసిన క్రషర్ యజమానులపై చర్య తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొత్తగొల్ల మల్లేష్ యాదవ్,కార్యదర్శులు మల్లేపల్లి శ్రీకాంత్, టి.యాదగిరి, కె..రవీందర్ పాల్గొన్నారు.

## అంబలి పంపిణీ

**నారాయణఖేడ్, మే 5 సిరి న్యూస్ః**



నారాయణఖేడ్ మండలంలోని సంజీవనరావుపేట్, సిర్గాపూర్ మండలంలోని కద్పల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి, జొన్నలు కొనుగోలు కేంద్రాలలో రైతులకు వెల్లి , జిఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు అంబలి పంపిణీ చేశారు.

## ఫీజు రీఎంబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి

**అందోల్, మే 5 సిరి న్యూస్**



విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని - జోగిపేట మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ డి.బి.నాగభూషణం విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల మేర ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు.సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని మాజీ మార్కెట్ కమిటీ చెర్మన్ డిబి నాగభూషణం డిమాండ్ చేశారు.

## అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను బహిష్కరించాలి

**సంగారెడ్డి, మే 5 ( సిరి న్యూస్ )**

అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను వెంటనే బహిష్కరించాలని బిజెపి సంగారెడ్డి పట్టణ శాఖ అధ్యక్షులు దోమల విజయకుమార్ అన్నారు. డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు ద్వారకా రవి జిల్లా కౌన్సిల్ సభ్యులు శివంగుల నాగరాజ్ బాల మురళీధర్, పట్టణ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, శివ ,గోవింద్ బాబా చారి, తులసి ప్రకాష్ రెడ్డి. కిసాన్ మోర్చా అధ్యక్షులు లింగమూర్తి, ,రాము, హర్షవర్ధన్ రెడ్డి, భారతీయ జనతా యువమోర్చా నాయకులు లవన్ కుమార్ ,సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు